7

సాక్షి అనకాపల్లి

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



యూరియా కోసం తప్పని తిప్పలు

యూరియా కొరత రైతులను వేధిస్తూనే ఉంది. డిమాండ్ తగ్గ యూరియా సకాలంలో రాకపోడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. 8లో

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా ఏడుగురికి చోటు

విశాఖ సిటీ : వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు(పార్లమెంట్)గా ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన ఏడుగురిని నియమించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. అల్లూరి జిల్లాకు చెందిన గొట్టేటి మాధవిని రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంట్)గా నియమిస్తూ ఆమెకు ఎస్.కోట, యలమంచిలి నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. అలాగే అనకాపల్లి జిల్లాకు చెందిన దంతులూరి దిలీప్‌కుమార్‌రాజుకు చోడవరం, పెందుర్తి, పైలా శ్రీనివాసరావుకు మాడుగుల, పాయకరావుపేట, చిక్కాల రామారావుకు అనకాపల్లి, నర్సీపట్నం, చింతకాయల సన్యాసిపాత్రుడికి విశాఖ ఉత్తర, విశాఖ తూర్పు నియోజకవర్గాలను కేటాయించారు. అదే విధంగా విశాఖకు చెందిన చింతలపూడి వెంకటరామయ్యకు విశాఖ దక్షిణ, విశాఖ పశ్చిమ, తైనాల విజయ్‌కుమార్‌కు భీమిలి, గాజువాక నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారులుగా వ్యవహరిస్తారు.

న్యూస్‌రీల్

ఉద్యోగులమా.. వలంటీర్లమా?

- సచివాలయ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

యలమంచిలి రూరల్ : పట్టణంలో 10 వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గతంలో వలంటీర్లు చేసే పనులన్నింటినీ మాతో చేయిస్తున్నారని మేము ఉద్యోగులో లేక వలంటీర్లో అర్థం కావడం లేదని వారంతా వాపోయారు.వలంటీర్ల మాదిరిగా క్లస్టర్లలో లబ్ధిదారుల మ్యాపింగ్ చేయాలని ఇచ్చిన సర్క్యులర్‌ను తామంతా వ్యతిరేకిస్తున్నట్టు వారంతా స్పష్టంచేశారు.రాష్ట్ర వార్డు,గ్రామ సచివాలయాల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు నిరసన చేపట్టామని తెలిపారు. ఇంటింటికీ తిరిగి వలంటీర్లలా అన్ని పనులు చేయాలని చూడడంతో తమ ఆత్మగౌరవం దెబ్బతింటోందని నిరసనలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజుకు వినతిపత్రం ఇచ్చారు. సచివాలయ ఉద్యోగుల నిరసనతో సచివాలయాల క్లస్టర్లలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియ నిలిచిపోయింది.

9న కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు

అనకాపల్లి : ఫ్రీ బస్‌ల వల్ల ఈనెల 15 నుంచి ఆటో కార్మికుల కుటుంబాలను రోడ్డున పాలు చేసిన కూటమి ప్రభుత్వానికి త్వరలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 9వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డు ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని, ఫ్రీ బస్సు వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని, సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ కోసం రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఆర్టీసీలో ఉపాధి అవకాశాలు కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఈనెల 15వ తేదీలోపు తమ సమస్యలు పరిష్కారం చేయకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు బాపునాయుడు, మార్కెండేయులు, నాగల వెంకటేశ్వరరావు, కూనపల్లి అప్పలరాజు, పాలమరశెట్టి అంజి, నూకరాజు వాయిబోయిన వెంకటేష్ పాల్గొన్నారు.

వచ్చే నవంబర్ నాటికి అనకాపల్లికి పోలవరం జలాలు

- డీఆర్సీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి డోలా

మహారాణిపేట (విశాఖ):

వచ్చే నవంబర్ నాటికి పోలవరం ఎడమ కాలువ నీటిని అనకాపల్లి వరకు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం డీఆర్సీ సమావేశం అనంతరం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేసవిలో తాగు నీటి ఎద్దడిని నివారించడానికి నగరంలోని నీటి నిల్వ ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించామన్నారు. పోలవరం ఎడమ కాలువ నీటిని నిల్వ చేసేందుకు అదనపు ట్యాంకులను కూడా గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసేందుకు రైల్వే, పోర్ట్, నేవీ, డాక్‌యార్డ్ అధికారులతో పాటు జిల్లా రెవెన్యూ అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయాల్లో ప్రింటర్ల కొరత ఉందని, దీనికి సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. తాత్కాలిక పద్ధతిలో పారిశుధ్య కార్మికులను నియమించాలని ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. జీవో నంబర్ 30, 45 విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సచివాలయం.. నిర్వీర్యం..

- సచివాలయ ఉద్యోగులపై కూటమి కక్ష
- సర్వే పేరిట ఇబ్బందులకు గురి
- సంక్షేమ పథకాలను కోత పెట్టే బాధ్యతలు అప్పగింత
- ఇందుకోసం ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశాలు
- తాజాగా వాట్సాప్ సర్వీసుల పేరుతో రోడ్లపై తిప్పాలని నిర్ణయం
- ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల మండిపాటు
- ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ అత్యవసర సమావేశం
- వాట్సాప్ సర్వీస్ విధులను బహిష్కరించాలని నిర్ణయం
- నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

సచివాలయం



సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం సాయశక్తులా కృషి చేస్తోంది. పొమ్మనకుండా పొగపెట్టే ప్లాన్లు వేస్తోంది. ఇప్పటికే వలంటీర్లను నిర్దాక్షిణ్యంగా ఆపేసిన ప్రభుత్వం.. ఇపుడు సచివాలయం ఉద్యోగులపై పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే వస్తుంది. రేషనలైజేషన్ పేరిట సచివాలయాలను కుదించింది. ఏడాదిలోనే సొంత మండలాల్లో ఉండకూడదని కొత్త నిబంధన తీసుకొచ్చి బదిలీలు చేసింది. ఇపుడు కొత్తగా వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్లను అదనంగా రుద్ది మరింత ఒత్తిడి పెంచింది. రిజిస్ట్రేషన్ విధులను సచివాలయ ఉద్యోగులు మూకుమ్మడిగా బహిష్కరించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

సాక్షి, అనకాపల్లి :

సచివాలయ వ్యవస్థపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు సచివాలయ ఉద్యోగులకు శాపంగా పరిణమిస్తున్నాయి. ఈ ఉద్యోగుల విధులకు సంబంధించి నిర్దిష్టమైన విధానం లేకుండా ఎప్పటికప్పుడు తోచిన పనులు అప్పజెపుతుండడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఇంటింటికీ పెన్షన్ పేరుతో తిప్పుతున్న ఉద్యోగులను ఇకపై క్షేత్ర స్థాయి సర్వే వినియోగించాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించే బాధ్యతలను వీరికి అప్పగించారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేపట్టాల్సి ఉంది. దీనిపై ఉద్యోగులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

పథకాల లబ్ధిదారుల్లో కోత పెట్టాలని....

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో కోత పెట్టాలని కూటమి ప్రభుత్వం గట్టి నిర్ణయంతో ఉంది. ఇప్పటికే దివ్యాంగుల పెన్షన్లపై పడింది. అనేక మంది దివ్యాంగుల పెన్షన్లలో కోత పెట్టింది. లేచి నిలబడలేని వారి పింఛన్లు సైతం తొలగించింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ నెలకు మాత్రం పెన్షన్లకు తగ్గించకుండా యథావిధిగా నగదు జమ చేశారు. తర్వాత ఏం చేస్తారన్న టెన్షన్ దివ్యాంగుల్లో నెలకొంది. అలాగే మిగిలిన సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించే ప్లాన్ చేస్తోంది. ఇందుకోసం సచివాలయ ఉద్యోగుల ద్వారా పలు పథకాలు పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేయించాలని నిర్ణయించింది.

గూగుల్ మీట్‌లో రహస్య సమావేశం

గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేశారు. బలవంతంగా ఇంటింటికీ తిరిగే విధులు అప్పగిస్తున్నారు. ఇది ఇబ్బందికరంగా ఉందని పలువురు ఉద్యోగులు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నారు. అయినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయింది. తాజాగా శనివారం నుంచి వాట్సాప్ సర్వీస్‌కు సంబంధించి అవగాహన.. ప్రతీ ఇంటికి బలవంతంగా సర్వీస్ నమోదు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సచివాలయ ఉద్యోగులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇష్టానుసారంగా పనులు అప్పగిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా రహస్యంగా ఆన్‌లైన్‌లో భేటీ అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ గూగుల్ మీట్ ద్వారా అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. దాదాపుగా గంటన్నర పాటు పలు అంశాలపై చర్చించారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏపీజీడబ్ల్యూ ఎస్ఈజేఏసీ ముందుకు వెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

అలాగే వాట్సాప్ సర్వీస్ విధులను బహిష్కరించాలని నిర్ణయించినట్లు సమాచారం. సచివాలయ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులు ముకుమ్మడిగా బహిష్కరించాలంటూ నిర్ణయించుకున్నారు.

అనుమతుల్లేని ల్యాబ్‌లపై చర్యలు

- జిల్లా వైద్యాధికారి హైమావతి

బుచ్చెయ్యపేట : జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ల్యాబ్‌లను మూయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి హైమావతి హెచ్చరించారు. శనివారం ఆమె వడ్డాదిలో పలు ప్రైవేటు ల్యాబ్‌లను, ప్రభుత్వ ఆసుపత్రి, వసతి గృహాలు తనిఖీ చేశారు. వడ్డాదిలో ఉన్న పలు ప్రైవేటు ల్యాబ్‌ల వెళ్లి అక్కడ ల్యాబ్ టెక్నీషియన్లు చేస్తున్న టెస్టులను రికార్డులు తనిఖీ చేశారు. పదో తరగతి పాసై అనుభవం లేనివారు కూడా క్లినిక్‌లు ఏర్పాటు చేసి ల్యాబ్‌లు నిర్వహించడం, మిడిమిడి జ్ఞానంతో ఆర్ఎంపీ వైద్యులుగా, ల్యాబ్ టెక్నీషియన్లుగా చెలామణి అయిపోవడంపై ఆమె విస్తుపోయారు. అనుభవం లేకుండా క్లినిక్‌లు నిర్వహించడంపై ఆమె పలు క్లినిక్‌ల సిబ్బందిని హెచ్చరించారు. తక్షణం ల్యాబ్‌లు మూయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పలువురికి కొద్ది పాటి జ్వరం వచ్చినా అవసరం లేకున్న టెస్టులు చేసి వేలాది రూపాయలు వసూలు చేయడం, పేదవారి అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని వృత్తిని వ్యాపారంగా మార్చవద్దని పలువురిపై ఆగ్రహం చెందారు. వడ్డాదిలో ఒక క్లినిక్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్ఎంపీ వైద్యులతో మాట్లాడి వారు అందిస్తున్న సేవలు గురించి వాకబు చేశారు. వడ్డాదిలో వసతి గృహానికి వెళ్లి అక్కడ ఒక విద్యార్థి జ్వరంతో బాధపడగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుతున్నట్లు తెలుసుకున్నారు. వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి రికార్డులు,ల్యాబ్ టెస్టులను పరిశీలించారు. వైద్యురాలు రమ్యదుర్గ, ఎంపీహెచ్‌వో మోజెస్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వడ్డాదిలో ప్రైవేటు ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి హైమావతి

తీర ప్రాంతాల్లో అనుమానితులపై సమాచారమివ్వండి

- మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు

రాంబిల్లి(అచ్యుతాపురం) : తీర ప్రాంతాల్లో కనిపించే అనుమానిత వ్యక్తులు, విదేశీ బోట్ల కదలికల సమాచారాన్ని తమకు తెలపాలని అచ్యుతాపురం మెరైన్ సీఐ ఎస్ సింహాద్రి నాయుడు సూచించారు. రాంబిల్లి మండలంలోని వాడ రాంబిల్లిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన స్థానిక మత్స్యకారులతో మమేకం అయ్యారు. మత్తు పదార్థాల రవాణా వంటి కార్యకలాపాలు తీర ప్రాంతాల్లో జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చేపల వేటకు వెళ్లిన తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దేశ రక్షణలో తీర ప్రాంతాల మత్స్యకారులు కీలక పాత్ర పోషిస్తూ, అనుమానాస్పద కదలికల సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1093కి తెలియపరచాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమ్య, వీఆర్‌ఓ ఎస్.కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వి.లావణ్య, ఎస్ఐ నాగేంద్ర, నేవల్ ఇంటెలిజెన్స్ జి.అనిల్ కుమార్, కోస్టల్ సెక్యూరిటీ జగదీష్, ఎస్.జ్యోతిక, అప్పారావు, మెరైన్ ఎస్ఐ బి.రాజు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.



వాడరాంబిల్లిలో స్థానిక మత్స్యకార ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అచ్యుతాపురం మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు

మళ్లీ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

- కూటమి పాలనపై 15 నెలల్లో ప్రజా వ్యతిరేకత
- సూపర్ సిక్స్ పేరుతో నయవంచన
- యూరియా కోసం రైతులు రోడ్లెక్కడం దారుణం
- రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్ గంజాయితో అఘాయిత్యాలు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ విజయ సాయిరాజ్, విజయనగరం డిప్యూటీ మేయరు శ్రావణి, విశాఖ మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఉత్తరాంధ్ర మహిళా విభాగం జోన్ ఇన్‌చార్జి ఈర్లె అనురాధ, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి తదితరులు

విశాఖ సిటీ :

కూటమి ప్రభుత్వం 15 నెలల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి పేర్కొన్నారు. శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జోన్-1 మహిళ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే మహిళా విభాగాన్ని సంస్థాగతంగా పటిష్టం చేయాలని, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తీర్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలను, ముఖ్యంగా మహిళలను నిట్టనిలువుగా మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని చెప్పారు. ఎన్నికలకు ముందు అప్పటి సీఎం జగన్ కంటే ఎక్కువ మేలు చేస్తానని సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఎప్పుడూ చూడని విధంగా రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. కేంద్రం పూర్తి స్థాయిలో యూరియాను సరఫరా చేసినప్పటికీ వాటిని టీడీపీ నేతలు బ్లాక్ మార్కెట్ తరలించారని ఆరోపించారు.

ప్రజలకు రూ.81 వేల కోట్ల బకాయిలు

కూటమి ప్రభుత్వం రైతులకు మొదటి ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టి వెన్నుపోటు పొడిచిందన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తానని చెప్పి ఒక్కో మహిళకు రూ.22,500 బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు కింద ఇప్పటి వరకు రూ.45 వేలు బకాయి ఉందన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వక పోగా కొత్తగా ఒక్కరికి పింఛను గానీ, రేషన్ కార్డు గానీ మంజూరు చేయలేదన్నారు. పైగా రాష్ట్రంలో 3 లక్షల మంది అర్హులైన వారి పెన్షన్ తొలగించిందని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఇలా మొత్తంగా రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం రూ.81 వేలు బాకీ పడిందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి 16 రకాల బస్సులు ఉంటే.. కేవలం 5 రకాల బస్సుల్లో ప్రయాణికులకు అవకాశం కల్పించారన్నారు. అలాగే ఉచితంగా మూడు సిలిండర్లు అని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. మెడికల్ కాలేజీలను సైతం బినామీలకు కట్టబెట్టేందుకు ప్రైవేటుపరం చేయాలని చంద్రబాబు నిర్ణయించారని ఆరోపించారు.

మహిళలకు రక్షణ లేదు

రాష్ట్రంలో హోం మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మద్యాన్ని విచ్చలవిడి చేసేసిందని విమర్శించారు. 80 వేల బెల్టుషాపులు పుట్టుకొచ్చాయని, పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతులు ఇచ్చేశారని తెలిపారు. మద్యం కారణంగానే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలో డ్రగ్స్ డోర్ డెలివరీ జరుగుతోందని, గంజాయిని హోంమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలోనే పండిస్తున్నారని వివరించారు. వీటిని అరికట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు అందరూ తమ స్వలాభం కోసం పనిచేస్తున్నారని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుడిలో ఉన్న దేవుడిని వెలివేసి మళ్లీ దేవుడు రావాలని ప్రార్థిస్తున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రానున్న మూడేళ్లు ప్రజల తరపున పోరాటం చేయడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, విశాఖ మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, ఉత్తరాంధ్ర మహిళా విభాగం జోన్ ఇన్‌చార్జి ఈర్లె అనురాధ, కార్పొరేటర్లు, జోన్-1కు చెందిన మహిళా నాయకులు, రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జిలు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు, అధిక సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దగా పడ్డ వైట్ బర్లీ రైతు

- ఇంటి వద్దనే ముక్కిపోయిన పొగాకు
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు

గొలుగొండ : వైట్ బర్లీ పొగాకు రైతులు దగా పడ్డారు. పంట కొనుగోళ్లు లేక నష్టపోయారు. మాట ఇచ్చిన కంపెనీలు మోసం చేశారు. ఇంటి వద్ద నిల్వ ఉంచిన పొగాకు చివరికి నాశనం కావడంతో లబోదిబో అంటున్నారు. పొలల్లో, షెడ్లల్లో దాచిన పొగాకు బేళ్లు ఎందుకు పనికిరాకుండా పోవడంతో పెట్టుబడులు నష్టపోయి కన్నీరుమున్నీరు అవుతున్నారు.

500 ఎకరాల్లో సాగు..

గొలుగొండ మండలంలో వైట్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు దగా పడ్డారు. వీరితో పాటు అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో రైతులు అయితే చెప్పనక్కలేదు. సుమారుగా గొలుగొండ, గొలుగొండ మండలాల్లో 500 ఎకరాల్లో వైట్ బర్లీ సాగు జరగడం జరిగింది. వేసవి పొగాకు సాగుతో ఎంఎల్, ఐటీసీ కంపీలు రైతులు ప్రోత్సాహం అందించి సాగు చేయించారు. జనవరి, ఫిబ్రవరి నెలలో సాగు చేసిన రైతులు చాలా వరకు నష్టపోయారు. ఈ రెండు మండలాల్లో సాగు చేసిన రైతులు కష్టపడి పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు పొందారు. మేనెలలో ఈ రెండు కంపెనీలు కొనుగోళ్లు ప్రారంభించారు. కొయ్యూరు మండలంలో కంఠారం, గొలుగొండ మండలంలో చోద్యం వద్ద అరకొరగా కొనుగోళ్లు చేసి తూతూ మంత్రంగా చేతులు దులుపుకొన్నారు.



రైతులు కొనుగోళ్లు లేక పంట పొలాల్లో వదిలేసిన దృశ్యం



కొనుగోళ్లు చేయకపోవడంతో నిల్వ ఉండిపోయిన వైట్ బర్లీ పొగాకు బేళ్లు

అరకొరగా కొనుగోళ్లు...

వేసవిలో సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందని కంపెనీ యాజమాన్యం పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో నీటి వనరులు ఉన్న ప్రతి చోట ఈ సాగును రైతులు ప్రారంభించారు. వ్యవసాయ మోటార్లు, నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో సాగు మంచి దిగుబడులు సాధించారు. రైతులకు అవసరం అయిన ఎరువులు, నారును పై రెండు కంపెనీలు పోటాపోటీగా అందించారు. ఎకరానికి సుమారుగా రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటను మంచిగా సాధించిన రైతులకు కంపెనీలు తీవ్ర దెబ్బ కొట్టాయి. ఎంఎల్, ఐటీసీ కంపెనీలు వారికి ఎంత కావాలో అంత కొనుగోళ్లు చేసి మిగతా పొగాను వదిలేశారు. రైతులు అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే బగాను బేళ్లు జాగ్రత్తగా దాచి ఉంచండి వెంటనే కొనుగోళ్లు చేస్తామని.. కల్లబొల్లి కబుర్లు చెప్పి తప్పించుకున్నారు. కొంత మంది రైతులు పొగాకు పంటను పొలాల్లోనే వదిలేసారు.

కొనుగోళ్లు చేస్తామని దగా...

ఎకరానికి రూ. 50 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట నాశనం అవుతుంటుంటే ఏం చేయాలో అర్థం కాక లబోదిబో అంటున్నారు. మే, జూన్ వరకు పంటను కొనుగోళ్లు చేసిన కంపెనీలు త్వరలో రైతులు వద్ద ఉన్న పొగాకు కొనుగోళ్లు చేస్తామని ఉన్న పంటను జాగ్రత్తగా దాచి ఉంచాలని చెప్పి ఇప్పుడు జాడ లేకుండా పోయారు. దాచి ఉంచిన పొగాకు రంగు మారడం, ఉన్న బేళ్ల వద్ద పొగాకు తడిచిపోవడంతో పాటు ఎలకల వల్ల మరికొంత పంట నాశనమైంది. ఇలా ఈరెండు మండలాల్లో సుమారుగా రూ.రెండు కోట్ల వరకు విలువైన పంట ఉండిపోయిందని రైతులు చెబుతున్నారు. నీటి సదుపాయం ఉందని రైతులు ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు ఎకరాల వరకు సాగు చేయడం జరిగింది. నార్లు అందించిన కంపెనీలు చివరికి కనిపించకపోవడం చాలా బాధగా ఉందని రైతులు అంటున్నారు.



షెడ్డుల్లో ఆరబెడుతున్న పొగాకు(ఫైల్)

రూ.లక్షల్లో నష్టపోయాం



నేను రెండు ఎకరాల్లో వేసవిలో అనగా ఫిబ్రవరి నెలలో వైట్ బర్లీ సాగు చేశాను. నీటి సదుపాయం ఉండడం వల్ల పంటను బాగా పండించారు. మే నెలలో కొంతవరకు అమ్మకాలు చేయడం జరిగింది. నా చుట్టూ రైతులు నాతో పాటు కష్టపడి పండించారు. ఎంఎల్, ఐటీసీ కంపెనీలు పొగాకు నార్లుకు సరఫరా చేయడంతో అంతా ఉత్సాహంగా సాగు చేశాం. చివరికి కొంత పంట మాత్రమే కొనుగోళ్లు చేసి మిగతా పంటను జాగ్రత్తగా ఉంచాలని జులై నెలలోగా కొనుగోళ్లు చేస్తామని చెప్పారు. కానీ ఆగస్టు పూర్తయినా కొనుగోళ్లు చేయలేదు. దీనివల్ల ఇంటి వద్ద నిల్వ ఉంచి పొగాకు రంగు మారి, నాశనం అవుతోంది. దీంతో రూ.లక్షల్లో నష్టపోయాం.

–సుంకర శివ, లింగంపేట రైతు

క్లుప్తంగా

యూరియా కొరత లేకుండా చేస్తాం..



పి.కె.గూడెం పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఏవో

సాక్షి ఎఫెక్ట్..

నాతవరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు యూరియా కొరత లేకుండా చేస్తామని మండల ప్రత్యేకాధికారి మంగవేణి తెలిపారు. 'రైతుకు ఒకే ఒక బస్తా' శీర్షికతో ఈ నెల 6న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో పి.కె.గూడెం పీఏసీఎస్‌ను శనివారం ఆమె తహసీల్దార్ వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి సుగుణ సందర్శించారు. యూరియా నిల్వలను పరిశీలించారు. రైతులతో సమావేశమై వరి పంట సాగుకు సంబంధించి యూరియాతో పాటు అన్ని రకాలు ఎరువులు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం 12 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రామారావు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితురాలికి పోగొట్టుకున్న వస్తువుల అప్పగింత



సత్యవతికి పోగొట్టుకున్న వెండి వస్తువులు అందిస్తున్న సీఐ

అచ్యుతాపురం రూరల్ : పోగొట్టుకున్న వస్తువులను బాధితురాలికి స్థానిక పోలీసులు అందజేశారు. సీఐ నమ్మి గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలానికి చెందిన కందూరు సత్యవతి శనివారం ఉదయం 11 గంటల సమయంలో అచ్యుతాపురం కూడలిలోని జ్యూస్ షాప్ వద్ద 20 తులాల వెండి పట్టీల పర్సును పోగొట్టుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల సహాయంతో పోగొట్టుకున్న వస్తువులను గుర్తించారు. ఆమెకు పట్టీలు, ఇతర సామాన్లు అప్పగించినట్టు సీఐ తెలిపారు.

ఏరుదాటుతూ గల్లంతయ్యాడు...

చోడవరం : అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గోవాడ వద్ద గల శారదానదిలో పడిన ఒక వృద్ధుడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రవహిస్తున్న నీటి ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. గజపతినగరం గ్రామానికి చెందిన వ్యవసాయ పనుల నిమిత్తం ఏరు దాటుతున్న పెంటకోట రమణ(68) నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. వృద్ధుడి కోసం గజ ఈతగాళ్లతో పాటు పోలీసులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



కొత్తకోట పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు



బోయిలకింతాడ రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాతల పడిగాపులు

రావికమతం: యూరియా కొరత రైతులను వేధిస్తూనే ఉంది. డిమాండ్ తగ్గ యూరియా సకాలంలో రాకపోడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నాట్లు వేసిన తరువాత వరి ఎదుగుదలకు యూరియా సకాలంలో తప్పనిసరిగా వేయాలి. ఈ తరుణంలో రైతులు యూరియాం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొత్తకోట పీఏసీఎస్ 12 టన్నులు యూరియా మాత్రమే వచ్చింది. ఆధార్ కార్డ్, పాసు బుక్ జెరాక్స్ ఉన్న రైతుకు ఎకరానికి బస్తా మాత్రమే ఇస్తున్నారు. కొత్తకోట పీఏసీఎస్ వద్దకు యూరియా కోసం రైతులు ఎక్కువగా రావడంతో రైతు సేవా కేంద్రం సిబ్బంది, సహకార సంఘం సిబ్బంది, మహిళా పోలీసుల సహాయంతో పంపిణీ చేశారు.

దేవరాపల్లి: మండలంలో శనివారం బోయిలకింతాడ, ఎ.కొత్తపల్లి రైతు సేవా కేంద్రాలు, దేవరాపల్లి మన గ్రోమోర్ షాపు వద్ద పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. మన గ్రోమోర్ షాపునకు అధిక సంఖ్యలో రైతులు తరలిరావడంతో ఆ ప్రాంగణమంతా కిక్కిరిసింది. కొంత మంది నుంచి మాత్రమే ఆధార్, వన్‌బీ ధ్రువపత్రాలు తీసుకొని, మిగతా వారు మరుసటి రోజు రావాలని అధికారులు సూచించడంపై రైతులు తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికే పనులు మానుకొని వచ్చామని, మళ్లీ ఒక్క బస్తా కోసం రావాలంటూ ప్రశ్నించారు. బోయిలకింతాడలో ఉదయం నుంచి రైతులు అధిక సంఖ్యలో ఎగబడ్డారు. ఎంత విస్తీర్ణం ఉన్నా ఒక బస్తా మాత్రమే పంపిణీ చేయడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎ.కొత్తపల్లి రైతు సేవా కేంద్రంలో ముషిడిపల్లి, కొత్తూరు ముత్యాలమ్మపాలెం, యండపల్లిపాలెం రైతులకు ఆధార్, వన్‌బీ ధ్రువపత్రం ఆధారంగా పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు. ఒక్క బస్తా కోసం కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడంపై పలువురు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



కె.కోటపాడులో యూరియా రిజిస్ట్రేషన్‌కు వేచి ఉన్న రైతులు

కె.కోటపాడు : బస్తా యూరియా కోసం కె.కోటపాడు రైతు సేవా కేంద్రానికి శనివారం ఉదయం 6 గంటల నుంచే రైతులు వేచి ఉన్నారు. మండలంలో కె.కోటపాడు, గుల్లేపల్లి, మేడిచర్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 32 టన్నుల యూరియా వచ్చింది. క్యూలో ఉండి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. గతంలో యూరియా కోసం ఇటువంటి ఇబ్బందులు పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మరోసారి బయటపడ్డ టీడీపీ వర్గ విభేదాలు

- రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబుకు అవమానం
- ఆయన రాక ముందే వడ్డాది, పేట డైవర్షన్ రోడ్ల మరమ్మతులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



వడ్డాదిలో తాతయ్యబాబు రాకముందే శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట: మండలంలో టీడీపీ వర్గ విభేదాలు మరోసారి బయట పడ్డాయి. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిపైన, విజయరామరాజుపేట తాచేరు నదిపై కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబుకు తీవ్ర అవమానం జరిగింది. ఆయన రాక ముందే ఎమ్మెల్యే రాజు ఆయా పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు సొంత గ్రామమైన వడ్డాదిలో డైవర్షన్ రోడ్డుకు ముందుగా శంకుస్థాపన చేశారు. అయితే ఆయన రాక ముందు ఎమ్మెల్యే రాజు టీడీపీ నాయకులతో కలిసి భూమి చేశారు. తరవాత వచ్చిన తాతయ్యబాబు కొబ్బరికాయ కొట్టారు. ఇద్దరూ కనీసం పలకరించుకోలేదు. విలేకరులతో మాట్లాడిన వెంటనే ఎమ్మెల్యే వెళ్లిపోయారు. అప్పుడూ కూడా పలకరించలేదు. గత ఏడాదిన్నరగా ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల మధ్య వర్గ విభేదాలు కొనసాగుతున్నాయి. టీడీపీలో రెండు గ్రూపులుగా విడిపోయారు. ఇప్పటికే వడ్డాదిలో తాతయ్యబాబు వెనకాల ఉన్న నాయకులందరిని ఎమ్మెల్యే రాజు తనవైపు లాక్కోని తాతయ్యబాబును ఒంటరి చేయాలని పావులు కదుపుతున్నట్లు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఇటీవల తాతయ్యబాబు కుమారుడి నిశ్చితార్థానికి వెళ్లిన కొంత మంది టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే రాజు స్వయంగా ఫోన్ చేసి ఎందుకు వెళ్లినట్టు నిలదీసినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబుల మధ్య విభేదాలు ఏ స్థాయికి చేరాయో తెలుస్తుందని పలువురు టీడీపీ, కూటమి నేతలే చర్చించుకుంటున్నారు. ఈ శంకుస్థాపన విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతుందని కొంత మంది కూటమి నేతలు భావించారు. అయితే ఇప్పటికే వడ్డాది, విజయరామరాజుపేట వంతెనలు, డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇలాంటి సమయంలో టీడీపీలో ఘర్షణలు పడితే ప్రజలు ఛీ కొడతారని ఇరువర్గాలవారు చల్లన జారుకున్నారు. వడ్డాది డైవర్షన్ రోడ్డు పనులకు రూ.8 లక్షలు, విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్డు పనులకు రూ.18 లక్షలు మంజూరయ్యాయి.

భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా విజయనగరానికి చెందిన పాంగి రాజారావు(40) కాలు జారి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో హుటాహుటినా నర్సీపట్నం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖకు తీసుకెళ్లారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సంప్రదించగా పనులు చేస్తుండగా కాలు జారి కింద పడిపోయాడని తెలిపారు. ఏఎల్‌పురంలో అనుమతులకు మించి భవన నిర్మాణాలు చేపడితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

శారదానదిలోకి దూకి యువతి ఆత్మహత్యాయత్నం



శారదానదిలో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, (ఇన్‌సెట్) గల్లంతైనకీర్తికుమారి(ఫైల్)

మునగపాక : మండలంలోని ఉమ్మలాడ శారదానదిలో శనివారం ఓ యువతి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన చోటు చేసుకుంది. యువతి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ పి.ప్రసాదరావు విలేకరులకు తెలిపారు. అనకాపల్లికి చెందిన బుద్ద కీర్తి కుమారి అనకాపల్లి బెల్లం మార్కెట్‌లోని వైశ్యా బ్యాంక్‌లో పని చేస్తున్నారు. శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆమె మునగపాక మండలం ఉమ్మలాడ శారదానదిలో దూకి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అగ్ని మాపక శాఖ అధికారులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు రాత్రి 8 గంటల వరకూ వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. కాగా కీర్తికుమారి ఆత్మహత్యాయత్నంకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ మాటల్లో నిజాయితీ కరువు

- గిరి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో వైఫల్యం
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం



దేవరాపల్లి: గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలిపించి, గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపుతామని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాటల్లో నిజాయితీ కొరవడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాల్లో చేపట్టిన రోడ్డు పనులకు బిల్లులు ఇవ్వక పోగా, కొత్తగా రోడ్లు మంజూరు చేయలేదన్నారు. దేవరాపల్లి మండలంలో చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు, నేరెళ్లపూడి రహదారి వర్షాలకు కొట్టుకుపోవడంతో గిరిజనుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. వి.మాడుగుల మండలం అజయపురం గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కూలి పనికి వెళ్లి కట్టెల వంతెన దాటబోయి కాలు జారి గెడ్డలో పడి చనిపోయిందన్నారు. అజేయపురానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక గిరిజనులు పలుమార్లు మొర పెట్టుకున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ మహిళ మచ్చమ్మ చనిపోయిందని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పవన్‌కల్యాణ్ స్పందించి బోడిగరువు, నేరెళ్లపూడి, అజయపురంతో పాటు శంకరం పంచాయతీలోని ఏడు గ్రామాలకు రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలని వెంకన్న కోరారు.

విశాఖ టు అమరావతి ఆటోడ్రైవర్ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న శ్రీనుకు సంఘీభావం తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

నక్కపల్లి : ఆటోడ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తున్న ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలంటూ విశాఖపట్నానికి చెందిన ఆటో డ్రైవర్ చింతకాయల శ్రీను విశాఖపట్నం నుంచి అమరావతికి పాదయాత్ర చేపట్టాడు. శనివారం నక్కపల్లి చేరుకున్న శ్రీనుకు ఆటో డ్రైవర్లు స్వాగతం పలికారు. అతనితో పాటు, కొద్ది దూరం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఎన్నో కష్టాలు వ్యయప్రయాసలు పడుతూ ప్రాణాలను ఆటోడ్రైవర్లు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. సరైన ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్న తమపై మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో మహిళలెవరూ ఆటోలో ప్రయాణించకపోవడం వల్ల పూర్తిగా ఆదాయం కోల్పోయి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకానికి ప్రత్యామ్నాయం అలోచించి ఆటోడ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా చూడాలని, డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతున్నాను. ఆటోడ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో విశాఖపట్నం నుంచి అమరావతి వరకు పాదయాత్ర చేస్తున్నానన్నాడు.

అడ్డురోడ్డు చేరుకున్న పాదయాత్ర

ఎస్.రాయవరం: మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్ చింతకాయల శ్రీను తలపెట్టిన పాదయాత్ర శనివారం ఉదయం అడ్డురోడ్డు చేరుకుంది. మండలంలో ఉన్న ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శ్రీనుకు పండ్లు, పండ్ల రసాలు అందజేశారు. పలు ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు ఆయనను సత్కరించి కొంత దూరం పాదయాత్ర చేసి సాగనంపారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, సింహాచలం, రమణ, మోహన్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓనం.. సుమధురం



కైరళి స్కూల్లో ఓనం పండగలో సంప్రదాయ దుస్తుల్లో, పులి వేషధారణల్లో విద్యార్థులు. చిత్రంలో ఎంఈవో ఉమ, ఎస్ఐ సత్యనారాయణ

దేవరాపల్లి : మండలంలోని కైరళి హైస్కూల్‌లో ఓనం పండగను సంప్రదాయబద్ధంగా శనివారం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ ఎంకె.దినేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.ఉమ, ఎస్ఐ వి.సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్థానిక విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. కేరళ సంస్కృతికి అద్దం పట్టే ఓనం పండుగను పురస్కరించుకొని విద్యాలయం ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి కేరళ గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన అబ్బుర పరిచింది. విద్యార్థుల పులివేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భవిష్యత్ పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి

- సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు పిలుపు
- చోడవరంలో సీఐటీయూ జిల్లా మహాసభలు ప్రారంభం
- గోవాడ సుగర్స్ ఆధునికీకరణ, బకాయిలు విడుదల కోరుతూ తీర్మానం



చోడవరంలో సీఐటీయూ మహాసభలో మాట్లాడుతున్న నరసింహారావు


చోడవరం: సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాటం చేస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక గంగా ఫంక్షన్ హాలులో శనివారం జిల్లా మహాసభలను ఆయన ప్రారంభించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులపై మోదీ ప్రభుత్వ దాడిని తిప్పి కొట్టడాన్ని కార్మిక వర్గం మరింత చైతన్యవంతంగా ముందుకు సాగాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటాన్ని ఆయన కొనియాడారు. జిల్లాలో కనీస వేతనాలు, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. వలస కార్మిక చట్టం కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పీ–4 పేరుతో పేదలను బంగారు కుటుంబాలు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

● గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి, కార్మికులు, రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనురు వరలక్ష్మి సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. సహకార రంగంలో నడుస్తున్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోతే ఈ ప్రాంత రైతుల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ప్రభుత్వం రూ.100 కోట్లు గ్రాంటుగా అందజేసి, ఆధునికీకరించి, రైతులు, కార్మికులకు రూ.30 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఈ మహాసభల్లో అధ్యక్ష వర్గంగా కె.లోకనాథం, గూనురు వరలక్ష్మి, వి.వి.శ్రీనివాసరావు, దుర్గారాణి వ్యవహరించగా, సీఐటీయూ నాయకులు సత్తిబాబు, మళ్ల సత్యనారాయణ, ఎ.బాలకృష్ణ, జయలక్ష్మితో పాటు సీతారామ్ ఏచూరి, అచ్యుతానందన్‌తో పాటు ఇటీవల మృతి చెందిన కార్మిక నాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. యూనియన్ నాయకులు ఆర్.రాము, గనిసెట్టి సత్యనారాయణ, నాగేషు, రుపాదేవి, సత్యవతి, త్రినాథు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌వీ నాయుడు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- ఇద్దరికి గాయాలు



మర్రిబంద బీపీసీఎల్‌పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో మర్రిబంద బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ఎదురుగా 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. విశాఖపట్నం కోరమాండల్ ఫెర్టిలైజర్స్‌లో పనిచేస్తున్న ఆర్.వంశీ భార్య సునీత, ఇద్దరు కుమారులతో విజయవాడ ఆటోనగర్‌లో మృతి చెందిన బంధువు కుటుంబీకులను పరామర్శించేందుకు విశాఖపట్నం నుంచి కారులో బయలుదేరారు. యలమంచిలి మండలం మర్రిబంద సమీపంలో పెట్రోల్ బంకు ఎదురుగా వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారును ఒక ద్విచక్రవాహనాన్ని తప్పించడానికి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో రోడ్డు పక్కగా ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. కారు దూసుకెళ్లిన ప్రాంతంలో ఒక కల్వర్టు కూడా ఉండడంతో కారు ముందుభాగం నుజ్జయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎయిర్ బ్యాగ్‌లు తెరుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే కారు ఎడమవైపు భాగం దెబ్బతినడంతో ముందు సీట్లో కూర్చున్న వంశీ భార్య సునీత తలకు తీవ్ర గాయమైంది. భర్త వంశీ స్వల్పంగా గాయపడ్డారు. వెనుక సీట్లో కూర్చున్న ఇద్దరు కుమారులు గౌతమ్, మోక్షిత్ సురక్షితంగా ఉన్నారని వంశీ సాక్షికి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్సులో గాయపడిన భార్యాభర్తలిద్దర్నీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి అక్కడ్నుంచి విశాఖ రాంనగర్ కేర్ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించామన్నారు.

పాము కాటుతో యువకుడి మృతి




మృతి చెందిన శ్రీను

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన బుద్ద శ్రీను(28) పాము కాటుకు గురై మృతిచెందాడు. మృతుడు తండ్రి గోవింద తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీను శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి బహిర్భూమికి వెళ్లగా ఎడమ కాలిపై విష సర్పం కాటు వేసింది. పాము కాటుకు గురైన శ్రీను కేకలు వేయడంతో వెంటనే అతడి స్నేహితులు స్పందించి ద్విచక్ర వాహనంపై కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. కాగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి గోవింద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్ఐ పి. సత్యనారాయణ శనివారం తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు చెల్లెలు రమ్య ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధంతరంగా మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వర్షా కాలం కావడంతో పాము సంచరించే ప్రమాదం ఉన్నందున రాత్రి సమయాల్లో పొలాలు, బహిర్భూకి వెళ్లే సమయంలో టార్చి లైట్లు వెంట తీసుకువెళ్లాలని మండల ప్రజలకు ఎస్ఐ సత్యనారాయణ సూచించారు.

క్రైస్తవులను మోసగించిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ

అనకాపల్లి : రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్‌ని నేటి వరకూ ఏ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేయడంతో కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ఎస్ జోసఫ్ అధ్యక్షతన శనివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లాలో 29 అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీనిలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఒక విభాగమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దెనెక్కి క్రైస్తవులను మోసం చేసిందన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రశ్నించే గొంతులను అణచి వేయాలని చూస్తే కూటమి ప్రభుత్వానికి అంతం తప్పదని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం అధ్యక్షులు సన్నీజేమ్స్, తిమోతి నాయుడు, బేతిరెడ్డి విజయ్ కుమార్, సువార్త రాజు, పడాల గంగరాజు, జిల్లాలో పాస్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

కశింకోట: మండలంలోని వెదురుపర్తి, కశింకోట గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 18 మందికి మంజూరైన రూ.30.38 లక్షల చెక్కులను మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ శనివారం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ పూలు, తులసీమాలల అలంకరణతో కనువిందు చేశారు. భాద్రపద మాసం రెండో శనివారం పురస్కరించుకొని స్వామివారిని అందంగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు. గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పట్టణ సుందరీకరణకు చర్యలు

అనకాపల్లి టౌన్: పట్టణ సుందరీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్‌లో జీవీఎంసీ జోన్ కార్యాలయ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లయిన వేల్పులవీధి జంక్షన్, గాంధీబొమ్మ, రింగ్‌రోడ్ ప్రాంతాలను విస్తరించే విధంగా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. వార్డుల వారీగా ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ డిపార్ట్‌మెంట్‌లోనూ అవినీతి జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. పార్కులలో దేశ నాయకులు, వివిధ రకాల బొమ్మలను ఏర్పాటు చేయాలన్నారు. డంపింగ్ యార్డుకు ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని పరిశీలించాలని, కుక్కల బెడదను తక్షణమే అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

13న నిరుద్యోగులకు జాబ్ మేళా



జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొణతాల రామకృష్ణ, ఎన్.గోవిందరావు

అనకాపల్లి : ఈనెల 13న స్థానిక మెయిన్‌రోడ్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో శనివారం జాబ్ మేళా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో నిరుద్యోగ యువతీ యువకులు 18 నుంచి 35 ఏళ్ల కలిగి, పదో తరగతి నుంచి పీజీ, ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులకు ఉదయం 9 గంటల నుంచి 25 కంపెనీల ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ముందుగా nai punyam.ap.gov.in లో పూర్తి వివరాలను నమోదు చేసుకుని హాజరు కావాలని కోరారు. వివరాలకు 7013342667 సంప్రదించాలన్నారు.

పెట్రోలు బంకుకు రాజకీయ గ్రహణం

- ఎంపీ ఆదేశాలతో పనులకు బ్రేక్
- డీసీఎంఎస్ స్థలంలో ఆగిన నిర్మాణం
- వాహనదారుల నుంచి విమర్శల వెల్లువ





డీసీఎంఎస్ స్థలంలో అసంపూర్తిగా నిర్మించిన పెట్రోల్ బంకు స్థలం



డీసీఎంఎస్ బోర్డు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పాలనలో అనకాపల్లి పట్టణానికి కొత్తగా ఒక ప్రాజెక్టు తీసుకురాలేదు. కానీ వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను నిలుపుదల చేస్తున్నారు. తాజాగా పెట్రోలు బంకు నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. ఈ పనులు నిలుపుదల చేయాలని ఎంపీ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. దీనిపై వాహనదారుల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనకాపల్లి పట్టణంలో ఎన్టీఆర్ క్రీడా మైదానానికి ఆనుకుని ఎకరా 78 సెంట్లు డీసీఎంఎస్ ప్రభుత్వ స్థలం ఉంది. ఇరవై సంవత్సరాల క్రితం ఈ స్థలం ద్వారా డీసీఎంఎస్‌కు ఎంతో ఆదాయం వచ్చేది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడంతో వైఎస్సార్ సీపీ పాలనలో డీసీఎంఎస్‌కు ఆదాయం కోసం అన్వేషించి 20 సెంట్ల స్థలంలో హెచ్‌పీసీఎల్ కంపెనీ యాజమాన్యంతో అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మమూరి అశోక్, అనకాపల్లి జిల్లా జేసీ జాహ్నవి చర్చించి పెట్రోల్ బంకు నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ హెచ్‌పీసీఎల్ కంపెనీ యాజమాన్యం 2024 డిసెంబర్‌లో కొత్తగా పెట్రోల్, డీజిల్ బంకు నిర్మాణానికి పనులు ప్రారంభించింది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపడుతున్న సమయంలో కూటమి ఎంపీ ఆదేశాలతో బంకు నిర్మాణ పనులు ఆగిపోయాయి.

పట్టణంలో చర్చనీయాంశం

పట్టణ పరిధిలో పెట్రోల్ బంకు లేకపోవడంతో అన్ని వర్గాల ప్రజలకు డీసీఎంఎస్ ఆవరణలో కొత్తగా పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నారని తెలుసుకుని వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురాకుండా నిలుపుదల చేయడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

డీసీఎంఎస్‌కు ఆదాయానికి గండి

20 సంవత్సరాల లీజ్ అగ్రిమెంట్‌తో హెచ్‌పీసీఎల్ యాజమాన్యం డీసీఎంఎస్ స్థలంలో నిర్మాణం చేస్తున్న పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. వాస్తవంగా ఈ బంకును పూర్తిస్థాయిలో నిర్మించి వినియోగంలోకి తెస్తే హెచ్‌పీసీఎల్‌కు నెలకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల ఆదాయం వచ్చేదని అంచనా. డీసీఎంఎస్‌కు నెలకు అద్దె రూపంలో రూ.50 వేలు, లీటరుపై రూ.3, డీజిల్‌పై రూ.2 అదనంగా ఇచ్చేందుకు హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. ఈ విధంగా డీసీఎంఎస్‌కు నెలకు రూ.2.5 లక్షల ఆదాయం వచ్చేది. కూటమి నాయకులు అడ్డుకోవడం వల్ల రావాల్సిన ఈ ఆదాయానికి గండి పడింది.

డీసీఎంఎస్ చుట్టూ వ్యాపార సముదాయాలు

డీసీఎంఎస్ స్థలం చుట్టూ నిత్యం వ్యాపారాలు సాగుతాయి. అనకాపల్లి గ్రామీణ ప్రజలు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి నిత్యం అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు వస్తుంటారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో పలు కార్యక్రమాలకు పలువురు వస్తుంటారు. డీసీఎంఎస్ రహదారి మీదుగా ఎన్టీఆర్ ఆస్పత్రికి, నూకాంబిక ఆలయానికి అనేక మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న డీసీఎంఎస్ స్థలంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తే ఆదాయంతోపాటు ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని పట్టణవాసులు చెబుతున్నారు.

రాజకీయ జోక్యం తగదు



పట్టణ పరిధిలో పెట్రోల్ బంకు లేకుండా పోయింది. జాతీయ రహదారిలో పెట్రోల్ బంకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. ఇక్కడ హెచ్‌పీసీఎల్ బంకు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. బంకు ఏర్పాటు చేసే సమయంలో రాజకీయ జోక్యం లేకుండా డీసీఎంఎస్‌కు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కె.ఎం.నాయుడు, వాహనదారుడు, అనకాపల్లి

డీసీఎంఎస్‌కు ఆదాయం వద్దా..?



పట్టణంలో రూ.కోట్ల విలువ చేసే డీసీఎంఎస్‌కు స్థలం ఉన్నప్పటికీ పైసా ఆదాయం లేకుండా పోయింది. 20 ఏళ్లుగా ఖాళీగా ఉన్న స్థలంలో పెట్రోల్, డీజిల్ బంకు ఏర్పాటు చేయడం వల్ల డీసీఎంఎస్‌కు ఆదాయం రావడంతోపాటు వాహనదారులకు మేలు జరుగుతుంది. – దాడి నారాయణరావు, వాహనదారుడు, అనకాపల్లి

పెట్రోల్ బంకు ఏర్పాటుకు కృషి

పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం డీసీఎంఎస్‌కు ఆదాయం లేకుండా పోయింది. సుమారుగా ఎకరా 78 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది.

– వి.వి.సత్యకుమార్, డీసీఎంఎస్, బిజినెస్ మేనేజర్, అనకాపల్లి

గుడి, బడి దగ్గర్లో బార్ ఏర్పాటు తగదు

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు



మాట్లాడుతున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలోనే పేరు గాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల గుడికి ఎదురుగా, పట్టణ బాలికోన్నత పాఠశాలకు దగ్గరలో, మహిళా పోలీస్ స్టేషన్ గోడకు ఆనుకొని కూటమి ప్రభుత్వం బార్ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బార్‌లు, వైన్ షాపులు ఏర్పాటు చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు తెలియదని చెపుతున్న నాయకులు తెరవెనుక చేస్తున్న వ్యక్తుల లాలూచీపై ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామన్నారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జాజుల రమేష్ మాట్లాడుతూ గుడి, బడి మధ్యలో బార్.. ఇదేనా కూటమి పాలన అని ఎద్దేవా చేశారు. పట్టణ నడిబొడ్డున బార్ ఏర్పాటు చేస్తున్నామని, ఐదు రోజుల క్రితం బోర్డు పెడితే వైఎస్సార్ సీపీ పోరాటానికి దిగే వరకు ఎందుకు స్పందించలేదని స్థానిక నాయకులను ప్రశ్నించారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాలే తప్పా లేని పోని బురద చల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్థానిక నాయకత్వంలో జరుగుతున్న కుట్రలో భాగంగానే బ్రాందీ షాపు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో 80, 84 వార్డుల ఇన్‌చార్జులు కె.ఎం. నాయుడు, కోరుకొండ రాఘవ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, ఉగ్గిన అప్పారావు, బొండా వాసు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

ఎస్.రాయవరం: నిబంధనలు ఉల్లంఘించి వేసిన లేఅవుట్ల క్రయ, విక్రయాలకు చెల్లుబాటు కావని జిల్లా పంచాయతీ అధికారి ఇ. సందీప్ హెచ్చరించారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు గ్రామాల్లో శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమంగా వేసిన లే అవుట్లపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో సాలిడ్‌వేస్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్వహణ పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణకు సూచించారు.

పాయకరావుపేట: స్థానిక పంచాయతీ పరిధిలో వేసిన లేఅవుట్‌ల్లో కమ్యూనిటీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. పట్టణంలో 55 అనధికార లేఅవుట్లు వేశారన్నారు. వీటిలో పంచాయతీకి కేటాయించిన స్థలాల ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'అన్నదాత పోరు' విజయవంతం చేయండి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సకాలంతో యురియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతీ గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, యూరియా సరఫరా చేసేవారన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి ప్రతీ రైతుకు వర్తింపజేయాలని, వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్‌సబ్సిడీ ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని తదితర డిమాండ్లతో కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో నిరసన తెలియజేసి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు, ప్రజలందరూ తరలి రావాలని కోరారు.

అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా నిరసన



నెహ్రూచౌక్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వ్యవసాయ తదితర ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం భారీ సుంకాలు పెంచి గుత్తాధిపత్యం చేయాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గతంలో అమెరికాకు చెందిన ఏ అధ్యక్షుడు తీసుకోలేని నిరంకుశ, నియంతృత్వ ధోరణి అవలంబిస్తూ భారత్ ఎగుమతులపై 50 శాతం భారీ సుంకాలు పెంచి ట్రంప్ మనదేశంపై తన అక్కసు వెళ్లగక్కరని మండిపడ్డారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతోపాటు ఏపీలో లక్షలాది మంది ఆక్వా రైతులు, జౌళి పరిశ్రమ రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు పెంటకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా దురహంకార సామ్రాజ్యవాదాన్ని ప్రపంచ దేశాలన్నీ తిప్పుకొట్టాలని కోరారు. రష్యా వద్ద భారతదేశంపై పెట్రోలియం ఉత్పత్తులు కొనుగోలు చేస్తుందన్న అక్కసుతో ట్రంప్ సుంకాల పెంచడం అన్యాయమన్నారు. సిగ్గు లేకుండా తానే యుద్ధాన్ని ఆపుతున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మోదీ మన దేశంలోని రైతులకు కార్మికులకు జరుగుతున్న అన్యాయానికి ప్రత్యామ్నాయం చూపకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు దొరబాబు, తాకాశి వెంకటేశ్వరరావు, వైఎస్.భద్రం, కోరుబిల్లి శంకరరావు, ముక్కామల చిన్ని, గండేపల్లి చిరంజీవి, హరీష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు

- రైతుకు ఒక బస్తా ఇవ్వడంతో గగ్గోలు
- గత్యంతరం లేక డీఏపీ, ఇతర ఎరువులు కొనుగోలు
- ఆర్థిక భారమవుతుందని ఆవేదన



కశింకోటలోని ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం రైతుల నిరీక్షణ



ఒక బస్తా యూరియా ఇస్తుండటంతో అదనంగా డీఏపీ బస్తా తీసుకెళుతున్న రైతు

కశింకోట: మండలంలోని రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. కశింకోట, తాళ్లపాలెంలో ప్రైవేటు డీలర్ల దుకాణాల వద్ద బారులు తీరి యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని శనివారం ఎదుర్కొన్నారు. అధికారుల ఆదేశాల మేరకు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకాల ఆధారంగా రైతుకు ఒక్కొక్క యూరియా బస్తా మాత్రమే ఇవ్వడంతో గగ్గోలు పెడుతున్నారు. ఎక్కువ కావాలన్నా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఒక బస్తా యూరియా నిర్ణీత ధర రూ.270కి ఇస్తుండటంతో డీఏపీ రూ.1350, పోటాష్ రూ.480, సూపర్ రూ.1800 వంతున చెల్లించి ఎరువులను ఎక్కువ ధరకు కొనుగోలు చేసి వేయాల్సి వస్తోందని, ఇది ఆర్థిక భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యూరియా విరివిగా దొరికేదని, ఇప్పుడు పరిమితులు విధించడం శోచనీయమంటున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, విత్తనాలు అందుబాటులో ఉండేవని, ఇప్పుడు ప్రైవేటు డీలర్ల వద్ద మాత్రమే విక్రయిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు. దీని దృష్ట్యా గతంలో వలె రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేసి ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒక బస్తా యూరియా చాలదు



మూడెకరాల్లో వరి నాటాను. ఐదు బస్తాలు అవసరం ఉండగా, ఒక యూరియా బస్తా మాత్రమే ఇచ్చారు. ఇది ఏ మూలకు సరిపోదు. పంట ఎలా సాగు చేయాలో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో యూరియా ఉండేది. ఎంత కావాలంటే అంత అందించే వారు. అప్పటిలాగే ఇప్పుడు యూరియాను ఇప్పటి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి.

– అల్లవరపు సన్యాసిరావు, రైతు, వెదురుపర్తి

డీఏపీ తీసుకోవాల్సి వచ్చింది



ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తుండటం వల్ల ఇంకా అవసరం ఉన్నందున ధర ఎక్కువైనా రూ.1350 చెల్లించి డీఏపీ బస్తాను తీసుకోవలసి వచ్చింది. ఇది అదనపు ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. అదే యూరియా అయితే 270కే లభిస్తోంది. దీని దృష్ట్యా అవసరం ఉన్న మేరకు తక్కువ ధరకు లభించే యూరియాను అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సతీష్, రైతు, జోగారావు పేట

యూరియా రానుంది

పది క్వింటాలు పైబడి యూరియా రెండు రోజుల్లో రానుంది. దీన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకుంటాం. మండలంలో యూరియా కొరత లేదు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రెండు ప్రైవేటు డీలర్ల వద్ద నిల్వలు ఉన్నాయి. ఇప్పటికే 538 టన్నులు అందించాం. ఇంకా 15 టన్నులు ఉన్నాయి. యూరియాను ఎకరాకు 75 కిలోల మేర మూడు దఫాలుగా వరి నాటిన తర్వాత, నెల రోజులకు, పొట్ట దశలోను వాడాలి. అవసరమైతే వంద కిలోల వరకు తప్ప ఎక్కువగా వాడటం ప్రయోజనకరం కాదు.

–ఎం. స్వప్న, ఏవో, కశింకోట

వినాయకా.. సెలవిక!





మహిళల కోలాటాల ప్రదర్శన

వైభవంగా నిమజ్జనోత్సవాలు



నర్సింగ్‌రావు పేటలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



గవరపేట శారదానదిలో వినాయక నిమజ్జనం



శారదానది ఒడ్డున క్రేన్ సహాయంతో వినాయకుడి నిమజ్జనాలు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది



యువతి, మహిళల నృత్యాలు ప్రదర్శన

కశింకోట: గణనాథుల నిమజ్జనోత్సవాలు కనుల పండువగా శనివారం సాయంత్రం జరిగాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగియడం, ఆదివారం చంద్ర గ్రహణం ఉండటంతో ఇక్కడ నెలకొల్పిన దాదాపు అన్ని విగ్రహాలను ఒకేసారి నిమజ్జనం చేయడం పండగలా సాగింది. మహిళలు, చిన్నారుల కోలాటాలు, నేల వేషధారణలు విశేషంగా అలరించాయి. సన్నాయి మేళాలు, తీన్‌మార్, డప్పులు వాయిద్యాలతో బాణసంచా పేలుళ్లతో గ్రామం అంతా మారుమోగింది. వినాయక విగ్రహాలు, ప్రతిమలను ట్రాక్టర్లు, వ్యాన్లు, ఎడ్ల బళ్లు, రిక్షాల్లో డప్పులు, వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యువతి, యువకులు, మహిళల నృత్యాలతో ఉత్సాహంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక గవరపేట, కాశీమదుం గ్రోయిన్, వెదురుపర్తి వంతెన ప్రాంతాల్లో శారదా నదిలో నిమజ్జనం చేశారు. కొందరు ఏలేరు కాలువ, చెరువుల్లోను నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం పలుచోట్ల భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. అర్ధరాత్రి దాటే వరకు సాగిన నిమజ్జనోత్సవాల్లో ఎక్కువ సంఖ్యలో పిల్లలతో పాటు మహిళలు, ప్రజలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణం, మండల వ్యాప్తంగా శనివారం గణేశ నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. 10 రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వాడవాడలా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన వినాయకుడి నిమజ్జనాలు రాత్రి 10 గంటల వరకు జరిగాయి. పురవీధులలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి శారదానది ఒడ్డుకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన క్రేన్‌పై నిర్వాహకులు ఉంచారు. అనంతరం జీవీఎంసీ సిబ్బంది నదిలో విగ్రహాలకు నిమజ్జనాలు చేశారు. భక్తులు నదిలో దిగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు నది ఒడ్డున పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ టి.వి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అన్ని ముత్యాల గార్మెంట్ అధినేత ముత్యాల వెంకటేశ్వరావు పేర్కొన్నారు. స్థానిక నర్సింగ్‌రావు పేటలో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, ఎం.వి.ఆర్. యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో టీచర్ బొడ్డేడ అప్పారావుకు సన్మానం



నరసింగబిల్లి హైస్కూలులో హెచ్‌ఎం రవికుమార్‌కు సన్మానం

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో శనివారం గురుపూజోత్సవం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎలిశెట్టి రామారావు, కాండ్రేగుల అప్పారావు, బొడ్డేడ అప్పారావు, ఆడారి వరలక్ష్మిలను దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఇతర ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించి ఆశీర్వాదం పొందారు. హెచ్‌ఎం ఎస్.వి.జె. ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నరసింగబిల్లి హైస్కూలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం రవికుమార్‌ను దుశ్శాలువా కప్పి సత్కరించారు. విద్యార్థులు నృత్యాలు,నాటికలు ప్రదర్శించి అలరించారు. ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలు చట్టాలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సూర్యలక్ష్మి

మునగపాక : మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎస్.సూర్యలక్ష్మి కోరారు. మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం సంకల్ప కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు హైజిన్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు రుతుక్రమం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళలు ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నపుడు ధైర్యం తెచ్చుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. మహిళలు హెల్ప్‌లైన్‌ల కోసం 100, 101, 1098, 1930 వంటి సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగలక్ష్మి, సీడీపీవో రమణకుమారి, హెచ్‌ఎం శంకరరావు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ మంజుల వాణి, మనోహర్, విశాలాక్షి, కార్యదర్శి పద్మావతి, మహిళా పోలీసులు పాల్గొన్నారు. అనంతరం కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు.